


# పరదేశీ కథలు
## - చిట్టే సిద్ధ లలిత



-93-

## నరసింహ కథ

అర్ధరాత్రి..

అది కడప జిల్లాలోని మారుమూల పల్లెటూరు. పగలంతా పొలం పనులు చేసుకుని అలసిపోయి, వళ్ళు పులిసిపోయి పెందలకాడే ఇంత అన్నం తిని ఊళ్ళో జనాలు గాఢనిద్రలోకి జారుకున్న వేళ.

చుట్టూ దట్టమైన అడవులతో ఒక మూలకి విసిరేసినట్లున్న ఆ ఊళ్ళోకి రయ్ మంటూ దూసుకు వచ్చాయి రెండు పోలీసు జీపులు. చప్పుడు కాకుండా బిలబిలమంటూ బండి దిగిన పోలీసులు ఇళ్ళ మీద పడ్డారు. పురుగుకు కూడా పారిపోయే అవకాశం ఇవ్వలేదు వాళ్ళు.

గూళ్ళు గుంతలు, కాగులు కంతలు, బిందెలు కడవలు అన్నీ వెతికారు. సారా కడవలు కంటపడిన చోట కోపంతో రెచ్చిపోయారు. కసిగా కడవలన్నీ పగలగొట్టారు. సామాన్లన్నీ విరగ్గొట్టారు.సారా ప్రవాహంతో వీధులు, వెగటు వాసనతో పరిసరాలు గుప్పుమన్నాయి.

కనబడిన మగాళ్ళని లాఠీలతో ఉతికిపారేసి, మక్కెలు విరగదీసి జీపెక్కించారు.  ఆదమరిచి నిద్రిస్తున్నారేమో, మత్తులో వున్నారేమో తప్పించుకొని పారిపోవడానికి ఎవరికీ కుదరలేదు. నిద్రలోంచి లేచిన ఆడవాళ్ళు, పిల్లలు పోలీసులను చూసి ఏడుస్తూ కేకలు వేయడం మొదలు పెట్టారు. హుషారుగా కదలబోయిన కొందరు ఆడవాళ్ళకి కూడా లాఠీలు తమ దెబ్బల రుచిని చూపించాయి.

బీభత్సం.... అరగంట సేపు. అంతే.అంతా ముగిసింది.

వచ్చి న వాళ్ళు వచ్చినట్లే వెళ్ళిపోయారు పోలీసులు.

మగవాళ్ళని ఎక్కించుకుని జీపులు పోయాక ఆ గ్రామంలో గందరగోళం నెలకొంది.

భర్తలను పట్టుకుని పోయినందుకు భార్యలు, కొడుకులను కొట్టినందుకు తల్లులు.. ఏడుస్తూ, నెత్తి నోరూ కొట్టుకుంటూ, పోలీసులను బూతులు తిడుతూ శాపనార్థాలు పెట్టసాగారు. ఏడుస్తూ, ముక్కులు చీదుకుంటూ పగిలిన కుండల పెంకులను ఊడ్చి బయట పోస్తూ, చెల్లా చెదురయిన సామాన్లను సర్దుకోసాగారు.

కానీ.. పెద్దింటి యల్లమ్మ మాత్రం పిచ్చి చూపులు చూస్తూ.. గుండెలు బాదుకుంటూ..

"వాళ్ళ చేతులు పడిపోనూ.. చంపేసారు నా కొడుకుని. తలకాయ పగిలిపోయి రక్తం కారుతున్నా వదల్లేదు. జీపెక్కించుకోని తీసకపోయి నా కొడుకుని చంపేస్తారేమో.నా కొడుకు మంచోడు, నలుగురికి బుద్ధి చెపుతాడు కానీ వాడు సారాయి కాంచడు నాయనా అని పోలీసోళ్ళ కాళ్ళు పట్టుకున్నాను.థూ.. కనికరమే లేదు ఆ నా కొడుకులకు. తప్పు చేసినోడ్ని కొట్టిరి. తప్పు చెయ్యని నా బిడ్డనూ కొట్టిరి. నేను నా బాధను ఏ దేవుడికి చెప్పుకోను. ఎవరికి మొర పెట్టుకోను" అని ఏడుస్తూ స్పృహ తప్పి పడిపోయింది.

పక్కనే వున్న ఆడోళ్ళు ఆమె మొహాన నీళ్ళు కొట్టి, సపర్యలు చేసినారు.

కాస్త కోలుకున్నాక బస్సెక్కి పోలీస్ స్టేషన్ కు పరిగెత్తింది యల్లమ్మ.

"నా కొడుకు అలాంటోడు కాదయ్యా వదిలి పెట్టమని" మొత్తుకుంది.

ఆమె మొర ఆలకించే వారెవరు. ఆమె ఏడుపు అరణ్యరోదనే అయ్యింది.

పదిరోజులు దాటినాక కొడుకు ఇంటికి వచ్చినాక కొడుకు వంటిమీద దెబ్బలను తడుముతూ యల్లమ్మ భోరుమని ఏడ్చింది.

"నా కొడకా.. నరసింహా..పెళ్ళయిన పదేళ్ళు బిడ్డలు పుట్టకపోతే పెంచలకోన నరసిమ్మునికి మొక్కితే పుడితివి. నిన్ను కళ్ళలో పెట్టుకుని పెంచితిని. ఇంటర్మీడియేట్ దాకా చదివించితిని. ఇంక రెండేళ్ళు పోతే నీకు పెళ్ళి చెయ్యాల. కానీ.. ఈ ఊళ్ళో ఎంత మంచిగా వున్నా నిన్ను వుండనివ్వరు. సంతోషంగా బతకనివ్వరు. అందుకే నువు కొయేటికి పో కొడకా. అక్కడైనా హాయిగా బతుకు. ఇక్కడ వుంటే తప్పుడు కేసులు పెట్టి నిన్ను జైల్లో తోస్తారు. పోలీసులు కొట్టి చంపేస్తారు. ఈ జనాల మధ్య, ఈ ఊళ్ళో నువ్వు ఎక్కడ వున్నా ఇదే పరిస్థితి" అంటూ వెంటనే ఏజంటు శీను దగ్గరికి పోయింది యెల్లమ్మ.

"కొయేటిలో మగాళ్ళ వీసాలు దొరకడం కష్టమని, లక్ష రూపాయలు అవుతుందని, ముందుగా డబ్బు ఇస్తే ఖచ్చితంగా చూస్తానని" ఏజంటు శీను చెప్పాడు.

నా కొడుకు కంటే ఏదీ ఎక్కువ కాదు అనుకుంటూ వున్న ఎకరం పొలం అమ్మేసింది యెల్లమ్మ.

డబ్బు చేతిలో పడేసరికి నవ్వుకుంటూ నెల తిరక్కముందే వీజా తెప్పించాడు ఏజంటు. మెడికల్ అవగానే

నరసింహను విమానం ఎక్కించాడు.

అక్కడ కువైట్ లో ఏదో ఒక వుద్యోగం వస్తుందని అనుకున్నాడు కానీ ఆ ఏజంటు నరసింహను ఒక కువైట్ ఇంట్లో తోట పనికి పెట్టాడు.

సరే ఏదో ఒకటి కొన్నాళ్ళు చేసుకుందాం అనుకుంటూ శ్రద్ధగా మొక్కల పనిలో మునిగిపోయాడు నరసింహ. పొలం పనుల్లో ముందే అనుభవం వుంది కాబట్టి తోటలో రకరకాల పూల మొక్కలు, కూరగాయలు వేసి శ్రద్ధగా పెంచసాగాడు నరసింహ. ఎడారి నేల అయినప్పటికీ తగిన ఎరువు వేస్తూ.. అదును చూసి నీళ్ళు పోస్తూ మొక్కలను చిన్నపిల్లల్లా చూసుకోవడంతో ఆర్నెల్లకే నందనవనంలా తయారయింది తోట.

పందిరికి అల్లుకున్న తీవెలతో, పచ్చని కొమ్మలు, రెమ్మలతో, గుత్తులుగా విరబూసిన పూలతో, కాసిన పళ్ళతో.. ఆ తోట కొత్త అందాలను సంతరించుకుంది. తోటలో ఒక మూల అన్ని సౌకర్యాలతో వున్న చిన్న రేకుల గది నరసింహ కోసం కేటాయించబడింది.

అక్కడ తను ఏర్పరుచుకున్న ప్రదేశంలో నరసింహకు ఉల్లాసంగా, ప్రాణం హాయిగా అనిపించింది. చెట్లతో చెలిమి, పూలతో కబుర్లు, కోయిలమ్మ పాటలు, పక్షుల కువకువలతో ఒక ఆశ్రమ వాసిలా జీవితం ప్రశాంతంగా సాగిపోతోంది.

చాలా రోజుల తర్వాత ఒకరోజు కువైట్ సేటు ఆ తోట వైపు వచ్చాడు. పచ్చని తోటను చూసి ఆశ్చర్య పోయాడు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఆనందించాడు. అద్భుతం అంటూ నరసింహను అభినందించాడు. పూలను పరామర్శించాడు. జామ కాయలు తెంపి తిన్నాడు.

"నరసింహా.. నాకు చాలా సంతోషంగా వుంది. మనం ఈ తోటను ఇంకా పెద్దది చేద్దాం.కూరగాయలు పండించి సూపర్ మార్కెట్లకు అమ్ముదాం. కావాలంటే వీసాలు, విమానం టిక్కట్లు ఇస్తాను. నీకు సహాయంగా ఇంకో ఇద్దరిని ఇండియా నుండి పిలిపించు. ఈ పక్కనే ఇంకో రెండు రేకుల గదులు వేద్దాం. ఈ నెల నుండీ నీ జీతం కూడా పెంచుతున్నాను. తోటకు ఎరువులు అవసరమైతే నన్ను అడుగు" అంటూ భుజం తట్టాడు.

తాను చేసిన పని సేటుకు నచ్చినందుకు జీతం పెంచినందుకు సంతోషించాడు నరసింహ. ఆ రాత్రంతా కూర్చుని ఊళ్ళోనుండి ఎవరిని పిలిపించాలా అని తీవ్రంగా ఆలోచించాడు నరసింహ.

స్నేహితులు పేరుకే గానీ ఒక్కరూ తన అభివృద్ధిని కోరేవారు కారు.వచ్చాక అసూయతో ఈ పనిని కూడా చెడగొట్టే ఆస్కారం వుంది.

ఇకపోతే బంధువుల్లో ఎవరిని పిలిపించాలి. ఎవరైనా సరే ఇక్కడికి వచ్చి నమ్మకంగా, శ్రద్ధగా పని చెయ్యాలి. తీరా

వచ్చాక నేను వుండను, పని చెయ్యను, ఇంటికి పోతాను అనే సమస్యలు కూడా ఎదురవుతాయి.

తెలిసిన వాళ్ళందరూ తాగుబోతులు, సిగరెట్ తాగే వాళ్ళే వున్నారు. కువైట్ లో సారా దొరకదు కానీ సిగరెట్ తాగినా కూడా ఈ సేటు ఒప్పుకోడు. రాత్రంతా ఆలోచించి పొద్దున్నే లేచి యెల్లమ్మకు ఫోన్ చేసాడు.

అంతా విన్నాక యెల్లమ్మ "అదేంట్రా నరసింహా.. నేనున్నాను. మీ అక్క మొగుడు మీ బావ వున్నాడు. వీసా పంపిస్తే ఆగమేఘాలమీద వస్తాము కదా. అందరం ఒక చోట వుండచ్చు. కలిసి పని చేసుకొని డబ్బు సంపాదించవచ్చు" అంది.

ఈ ఐడియా తనకు రానందుకు సిగ్గుపడ్డాడు నరసింహా.

"అమ్మా.. నీ బుర్ర చాలా పెద్దదే. బాగా చెప్పావు. అలాగే మీరు పాస్ పోర్టులు తయారు చేసుకోండి. నేను సేటుతో మాట్లాడతాను" అన్నాడు నవ్వుతూ.

కొయేటు అనగానే యెల్లమ్మ గాల్లో తేలిపోయింది. ఈ వయసులో కొడుకు వలన విదేశాలకి పోయే అదృష్టం దక్కినందుకు సంతోషించింది.

ఇంకేముంది. పనులన్నీ చకచకా జరిగిపోయాయి.

ఎవరో కాదు.. నరసింహ తల్లి, బావ ఇండియానుండి వస్తారు అనగానే సేటు కూడా సంతోషించాడు. అరబ్బులు కుటుంబానికి విలువనిస్తారు.

"సరే.. నువ్వు పెళ్ళి చేసుకుని భార్యను కూడా పిలిపించి ఇక్కడే స్థిరపడు" అన్నాడు సేటు.

పెళ్ళి అనగానే కాస్త సిగ్గు పడ్డాడు నరసింహా. అదీ నిజమే అనిపించి సేటు మాటలు తల్లికి చెప్పాడు. ఇక సంబంధాలు వెతకడం మొదలు పెట్టింది యెల్లమ్మ. నరసింహ బావ కూడా వ్యవసాయంలో ఆరితేరినవాడే. తోటనంతా చదును చేసి మడులు కట్టి కూరల మొక్కలు నాటాడు.

యెల్లమ్మ పూల మొక్కలపై దృష్టిని పెట్టింది. నరసింహ ఆలోచనలు ఇంకా పెద్దగా వున్నాయి.

తోటను విస్తరింపజెయ్యాలనేది అతని యోచన. సేటుకు చెప్పగానే పక్కనే వున్న పదెకరాలను కూడా కొని నరసింహ చేతిలో పెట్టాడు.

అపుడపుడూ తన కుటుంబాన్ని, స్నేహితులను కూడా తోటకు తీసుకొచ్చేవాడు సేటు. తన కోసం అక్కడొక గెస్ట్ హౌజ్ ను కూడా కట్టించాడు. ఒక కుక్కను కూడా తెచ్చి పెంచమన్నాడు.

గెస్ట్ హౌజ్ ను శుభ్రంగా వుంచి, కుక్క ఆలనా పాలనా చూడటానికి మరో ఇద్దరు మనుషుల్ని ఇండియానుండి పిలిపించమన్నాడు సేటు.

ఎగిరి గంతేసి అక్కను, అక్క కొడుకుని పిలిపించాడు నరసింహ. ఇంకేముంది. కుటుంబం మొత్తం కువైట్ లో చేరిపోయింది. అందరూ కలిసి పనులు చేసుకునే వారు.

కొత్త పంథాలో మెలకువగా, తెలివిగా తోటను బాగా వృద్ధి చేసారు.

ఇటు సేటుకు తోటలో మంచి ఆదాయం వచ్చేది. సేటు వ్యాపారం అభివృద్ధి చెంది పలుకుబడి హెచ్చింది. అందుకు కారణమయిన వీళ్ళకి కూడా మంచి జీతాలు ఇవ్వసాగాడు. నరసింహను బాగా ఇష్టపడే వాడు.

"నువ్వు నా పెద్ద కొడుకువి. నన్ను వదిలి ఇండియా పోవద్దు" అనేవాడు.

"అలాగే బాబా.. నిన్ను వదిలి పోనులే" అనేవాడు నరసింహ.

నరసింహను గురించి విని పెళ్ళి సంబంధాలు వెతుక్కుంటూ వచ్చాయి.

పెళ్ళి చేసుకుంటే అమ్మాయిని కూడా కువైట్ తీసుకుపోతాడు కాబట్టి అమ్మాయిలను ఇవ్వడానికి ఆడపిల్లల తల్లిదండ్రులు పోటీ పడ్డారు. మంచి ముహూర్తం చూసి ఇండియా వచ్చి అందరిలో బాగున్న పిల్లతో నరసింహ వివాహాన్ని వైభవంగా జరిపించారు. ఊళ్ళో అందరినీ పిలిచి భోజనాలు పెట్టారు.

అలా కొన్ని ఏండ్లు కువైట్ లో గడిచిపోయాయి. ప్రస్తుతం నరసింహకు నలుగురు పిల్లలు. ఆ పిల్లల చదువులన్నీ కువైట్ లోనే. సేటు పిల్లల చదువు బాధ్యతలు తీసుకుని మంచి స్కూల్లో చేర్పించాడు.

ఇప్పుడు నరసింహ జీతం నాలుగు లక్షలు. ఊళ్ళో వంద ఎకరాల పొలాలు కొన్నాడు. పెద్ద ఇల్లు కట్టించాడు. అడిగిన ఊరివాళ్ళకు కాదనకుండా వీసాలు తీసాడు. ఎందరికో పేద వాళ్ళకు సహాయం చేసాడు. కష్టాల్లో వున్న వాళ్ళను ఆదుకున్నాడు. ఊళ్ళో ఎవరూ సారా కాయకుండా అడ్డుకున్నాడు. అది నేరమని చెప్పి వారికి బతుకు తెరువు చూపించాడు. గుడి కట్టించాడు. బడికి స్థలం కొనిచ్చాడు. ఒక విధంగా నరసింహ వలన ఆ ఊరు బాగుపడిందని చెప్పచ్చు.

కాలం తీరిన యెల్లమ్మ కువైట్ లోనే కన్ను మూసింది. అక్కడే ఆమెను పాతి పెట్టారు. ఊళ్ళో ఎన్ని ఆస్తులు వున్నా కువైట్ వదిలి పోనంటాడు నరసింహ. బతికి వున్నంతవరకు సేటుకు సేవ చేస్తూ ఇక్కడే వుండిపోతానంటాడు. ఈ రోజు.. నరసింహ చేసిన సహాయాన్ని తలచుకుంటూ ఊళ్ళో వాళ్ళందరూ అతని గురించి గొప్పగా చెప్పుకునే వాళ్ళే. తన గురించి మాత్రమే ఆలోచన చేయక.. తన వాళ్ళకు, ఊరి వాళ్ళకు ఎంతో మేలు చేసిన నరసింహ నాలుగు కాలాలు ఊరి ప్రజల హృదయాల్లో నిలిచిపోతాడు అనడంలో సందేహం లేదు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments